## కేసీఆర్‌ను కలిసిన ముత్తిరెడ్డి

- వరంగల్‌లో దీక్షా దివస్‌ను సక్సెస్ చేయాలి
- జిల్లా ఇన్‌చార్జితో బీఆర్ఎస్ అధినేత



జనగామ రూరల్/కరీమాబాద్, నవంబర్ 27 : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను జనగామ మాజీ ఎమ్మెల్యే, దీక్షా దివస్ వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ యోగక్షేమాలు తెలుసుకున్న ఆయన.. ఈ నెల 29న దీక్షా దివస్ విజయవంతానికి వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో ఇటీవల నిర్వహించిన సన్నాహక సమావేశంతో పాటు 3వేల మందితో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అలాగే దీక్షా దివస్ నిర్వహణ తీరు. అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించిన అంశాలను అధినేత దృష్టికి తీసుకెళ్లగా విజయవంతం చేయాలని కేసీఆర్ చెప్పినట్లు ముత్తిరెడ్డి తెలిపారు.

# ఇండ్లు ఇచ్చే వరకు కదిలేది లేదు



డబుల్ బెడ్రూం ఇండ్ల ఎదుట టెంట్ వేసుకొని ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

- గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాకు కేటాయించింది
- కమిటీ పేరిట కాలయాపన చేస్తున్న కాంగ్రెస్
- కిరాయిలు కట్టలేక చచ్చిపోతున్నాం..
- పోలీసులు మమ్మల్ని ఇబ్బంది పెట్టొద్దు
- భూపాలపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

కృష్ణకాలనీ, నవంబర్ 27 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేటాయించిన ఇండ్లకు పట్టాలిచ్చేంత వరకు కదిలేది లేదంటూ భూపాలపల్లిలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు బుధవారం ఆందోళనకు దిగారు. కమిటీ పేరుతో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, అధికారులు కాలయాపన చేస్తున్నారంటూ జిల్లా కేంద్రంలోని 11వ వార్డు భాస్కర్ గడ్డలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల వద్ద టెంట్ వేసుకొని ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు నూతి రమేశ్, తాటికొండ సమ్మక్క, బండి కుమార్ మాట్లాడుతూ ఏడాదిగా రేపు, మాపు అంటూ పట్టాలివ్వకపోవడంతో విసిగిపోయామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు కొందరు గిట్టని వారు తప్పుడు సమాచారం ఇవ్వడంతో పట్టాలివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక సార్లు ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నా ఫలితం లేదని, మళ్లీ సర్వే చేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని పట్టించుకోవడం లేదన్నారు. తాము ఇండ్ల కిరాయిలు కట్టలేక చచ్చిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత జూన్‌లో నిర్వహించిన ధర్నాతో భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు, అధికార పార్టీకి చెందిన సభ్యులతో ఫైవ్ మెన్ కమిటీని ఎమ్మెల్యే వేశారని, వారు పరిశీలించి అర్హులందరికీ పట్టాలిస్తామని చెప్పారని తెలిపారు. కానీ, ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. తమ సమస్య పరిష్కారమయ్యేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని, పోలీసులు తమను ఇబ్బంది పెట్టొద్దని వేడుకున్నారు. కార్యక్రమంలో లావుడ్యా మధుకర్ నాయక్, ఐలాపురం స్వప్న, సుష్మ, తిరుమలతో పాటు మరో 30 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలో ఫొటో లేదని..

### కాంగ్రెస్ నేతల గొడవ



ఫొటోలో ఫ్లెక్సీ లేదని కాంగ్రెస్ నేతలు గొడవకు దిగారు. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టాల్సి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని తూర్పు తండా జీపీ పరిధి రేఖ్యాతండాలో మంగళవారం రాత్రి సీసీ రోడ్డు శంకుస్థాపనకు డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రూ నాయక్ వస్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ ఈ వివాదానికి కారణమైంది. – దంతాలపల్లి, నవంబర్ 27

కాంగ్రెస్ ప్రభుత్వంలో కూల్చివేతలు తప్ప కొత్తవి కట్టరేమో. ఇటీవల హనుమకొండలో సీఎం సభ కోసం ఆటలు ఆడుకునే మైదానాన్ని ఎంచుకోవడమే గాక.. అడ్డుగా ఉన్నదని ఒకటి కాదు నాలుగు చోట్ల ప్రహరీని కూల్చేశారు. అంతేగాక ఇష్టమొచ్చినట్లు రంధ్రాలు చేయడంతో గ్రౌండ్‌ను ఆగమాగం చేసి గాలికొదిలేశారు. అయితే అప్పుడు కూలగొట్టేందుకు అత్యుత్సాహం చూపిన అధికారులు.. పది రోజులైనా మరమ్మతులు చేయడం లేదు. దీంతో రాత్రివేళ ఆకతాయిలు నేరుగా గ్రౌండ్‌లోకి వాహనాల్లో వస్తూ మందుపార్టీలు చేసుకుంటుండడంతో కాలేజీ గ్రౌండ్ కాస్త అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నది.

- వరంగల్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

- ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ప్రహరీ నాలుగు చోట్ల కూల్చివేత
- పది రోజులైనా మరమ్మతులు చేయని ప్రభుత్వం
- పట్టించుకోని జిల్లా ఉన్నతాధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గ్రౌండ్

ఈ నెల 19న నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభ కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్ ప్రహరీని కూల్చిన అధికారులు



# కూల్చుడేనా.. కట్టేదెప్పుడు ?

### సీఎం సభ కోసం ఇష్టారాజ్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా ఈ నెల 19న హనుమకొండ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో 'ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సభ'ను నిర్వహించారు. ప్రభుత్వపరంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మహిళా శక్తి సభకు ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మహిళలు, సాధారణ జనం వచ్చేందుకు వేర్వేరు ద్వారాలను ఏర్పాటు చేశారు. దీని కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు ఉన్న ప్రహరీని నాలుగు చోట్ల కూల్చివేశారు. ప్రభుత్వపరంగా నిర్వహించిన కార్యక్రమం కోసం ప్రహరీని కూల్చడంలో అత్యుత్సాహం చూపిన జిల్లా ఉన్నతాధికారులు ఆ తర్వాత మరమ్మతు పనులను పట్టించుకోవడం లేదు. గతంలోనూ ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు వచ్చిన సందర్భాల్లో ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ప్రహరీని ఒకటిరెండు చోట్ల కొద్దిగా తొలగించి వెంటనే మరమ్మతులు చేసేవారు. ఈసారి అధికారులు పట్టించుకోకపోవడంతో కాలేజీ గ్రౌండ్‌లోకి రాత్రిపూట సైతం ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగుతున్నాయి. లోపలి వరకు వాహనాల్లో వచ్చి కొందరు ఇక్కడే మందు తాగి విందు చేసుకుంటున్నారు. ప్రహరీకి నాలుగు చోట్ల మరమ్మతులు కావడంతో ఎక్కువ ఖర్చవుతుందని, ఆమేరకు తమ వద్ద నిధులు లేవని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ అధికారులు చెబుతున్నారు.

**ఆటల గ్రౌండ్‌లో మీటింగ్**

క్రీడల అభివృద్ధికి, క్రీడాకారుల సాధికారతకు పాటుపడుతున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం పదేపదే చెబుతున్నది. ఆచరణలో మాత్రం దీనికి విరుద్ధంగా వ్యవహరించింది. వరంగల్ నగరంలో వేల మంది వ్యాయామానికి, అన్ని రకాల ఆటలకు వేదికగా ఉన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌ను మీటింగ్ కోసం విధ్వంసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్ నగరంలో కొత్తగా ఒక్క గ్రౌండ్‌ను అభివృద్ధి చేయకపోగా ఉన్న పెద్ద గ్రౌండ్‌ను ఆగం చేసింది. స్టేజీ, టెంట్లు, బారికేడ్లు, లైటింగ్, సౌండ్స్ ఏర్పాటు చేసేందుకు గ్రౌండ్ అంతటా పెద్ద పోళ్లు నాటారు. గ్రౌండ్‌లో ఇష్టం వచ్చినట్లుగా రంధ్రాలు చేశారు. దీంతో ఆటలు ఆడుకోలేని పరిస్థితి వచ్చింది. బహిరంగ సభ తర్వాత కనీస స్థాయిలోనూ మరమ్మతులు చేయడం లేదు.

### బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి

వరంగల్ నగరంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ఉదయం, సాయంత్రం వేలాది మంది వాకింగ్, ఆటల కోసం వస్తుంటారు. డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ఎక్కువగా ఈ గ్రౌండ్‌లో నిర్వహిస్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.40 లక్షలతో ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌ను అభివృద్ధి చేశారు. వాకర్స్ కోసం ప్రత్యేకంగా ట్రాక్‌ను, సోలార్ లైట్లను ఏర్పాటు చేసింది. మహిళలకు ఇబ్బంది లేకుండా మొబైల్ టాయిలెట్ సదుపాయం కల్పించింది. తెల్లవారుజామున, సాయంత్రం ఆలస్యంగా వాకింగ్‌కు వచ్చే వారికి రక్షణ పరంగా ఇబ్బందులు లేకుండా చేసింది. గ్రౌండ్‌ను మరింత అభివృద్ధి చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం బహిరంగ సభ కోసం ధ్వంసం చేసింది. మరమ్మతు పనులు చేయడం మరచిపోయింది.



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు

# మిల్లర్ల ఇష్టారాజ్యం

*ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నల్లగింజ, తాలు ఉన్నదంటూ సాకులు చెబుతూ మిల్లులకు చేరిన ధాన్యంలో క్వింటాల్‌కు ఐదు కిలోల దాకా కోతలు పెడుతూ అన్నదాతలను మోసం చేస్తున్నారు. కోతలు లేకుండా కొనాలని ప్రభుత్వం, అధికారులు చెబుతున్నా.. పట్టించుకోకుండా మేం చెప్పిందే ఫైనల్ అంటూ మిల్లర్లు రెచ్చిపోతున్నారు. ములుగు జిల్లా అంతటా మిల్లర్ల మాయాజాలంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని వెనక్కి తీసుకెళ్లలేక రైతులు నష్టపోవాల్సి వస్తున్నది.*

- ములుగు, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ)

### ధాన్యం కొనుగోళ్లలో రైస్‌మిల్లర్ల మాటే ఫైనల్

- క్వింటాల్‌కు 5 కిలోల కోత
- తాలు, నల్లగింజ సాకుతో మోసం
- సహకరిస్తున్న కేంద్రాల నిర్వాహకులు
- మాటలకే పరిమితమవుతున్న అధికారుల ఆదేశాలు
- ఇబ్బంది పడుతున్న అన్నదాతలు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర, క్వింటాలు సన్నవడ్లకు రూ.500 బోనస్‌ను ప్రకటించడంతో పాటు తాలు, తేమ పేరుతో కోతలు లేకుండా వడ్లను కొనుగోలు చేస్తామని ప్రకటించింది. అయితే, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లారీలు రైస్ మిల్లులకు తరలిన తర్వాత నల్లగింజ, తాలు పేరుతో మిల్లర్లు క్వింటాలుకు 5కిలోలు కోత విధించి దిగుమతి చేసుకుంటామని, కోతలు లేకుండా దించుకునేది లేదని తెగేసి చెబుతున్నారు. రైస్ మిల్లర్లకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం సహకరిస్తూ కోతల విధింపులో రైతులను అయోమయానికి గురి చేస్తూ క్వింటాలుకు 3 కిలోల నుంచి 5 కిలోల వడ్లను కట్ చేసి ట్రక్ షీట్లు నమోదు చేస్తున్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని పాల్‌సాబ్‌పల్లిలోని కొనుగోలు కేంద్రంతో పాటు బండారుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మ్యాక్స్ సొసైటీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు క్వింటాలుకు 5కిలోల వరకు కోతలు విధిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. పాల్‌సాబ్‌పల్లిలో రామాంజనేయ రైతు సంఘం ద్వారా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయగా, రైతులు ధాన్యాన్ని తీసుకొచ్చి వారం రోజులుగా కూలీలు, యంత్రాల సహాయంతో తూర్పార బట్టి, ఎండబోసి ధాన్యాన్ని విక్రయించారు. సదరు రైతు సంఘానికి బండారుపల్లిలోని సాయిరామ్ రైస్ మిల్లుతో పాటు పాపయ్యపల్లిలోని లక్ష్మీ రైస్ మిల్లులను అధికారులు కేటాయించారు. ఈ కేంద్రం నుంచి రెండు లారీలను సంబంధిత రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు వంశీ తరలించగా, రైస్ మిల్లుల యజమానులు వడ్లలో నల్ల గింజలు ఉన్నాయనే సాకుతో క్వింటాలుకు 5కిలోల కోత విధించి దిగుమతి చేసుకున్నారు. అదేవిధంగా బండారుపల్లి కొనుగోలు కేంద్రం నుంచి తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు 4 కేజీల చొప్పున కోత విధించి దిగుమతి చేసుకున్నట్లు పలువురు రైతులు పేర్కొంటున్నారు.



### కోతలు విధించే వరకు దిగుమతి చేసుకోలేదు



పాల్‌సాబ్‌పల్లికి చెందిన రామాంజనేయ రైతు సంఘం ద్వారా కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నాను. కొనుగోలు కేంద్రం నుంచి రెండు లారీల లోడ్ వడ్లను పంపిస్తే క్వింటాలుకు 5 కేజీల కోతను విధించారు. చేసేదేమీ లేక విషయాన్ని రైతులకు చెప్పి దిగుమతి చేశాను. మరో రెండు లారీలను కోతలు లేకుండా గోదాముకు తరలించాం. వ్యవసాయ శాఖ ఏవో సర్టిఫై చేసినా కోతలు తప్పడం లేదు.

– వంశీ, కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు

### 5 కిలోల చొప్పున కోత పెట్టారు..

నేను పండించిన వడ్లలో ముందు 192 బస్తాలను రైస్ మిల్లుకు కొనుగోలు కేంద్రం నుంచి పంపించాను. లారీ రైస్ మిల్లు వద్దకు వెళ్లిన తర్వాత క్వింటాకు 5 కిలోల చొప్పున కట్ చేస్తున్నారని కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు చెప్పాడు. అక్కడిదాక పోయిన వడ్లను వెనక్కి తేలేక కటింగ్‌కు ఒప్పుకున్నాను. ఇది చాలా అన్యాయం.

– తోట రాజు, రైతు



### ఇది వరకు ఇలా లేదు..

ఆరు ఎకరాల్లో సన్న వడ్లను పండించాం. పంట మొత్తం కోశాక తూర్పార పట్టమని అంటున్నారు. గతంలో ఇలా లేకుండే. వారం రోజులుగా తూర్పార పడుతూనే ఉన్నాం. బోనస్ కింద రూ.500 ఇస్తామని అంటున్నారు సరే, క్వింటాలు ధాన్యంలో 5 కేజీల కటింగ్‌లు దేనికి పెడుతున్నారు. అధికారులు ఇటు వచ్చుడే లేదు. కటింగ్ లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి.

– అంగోత్ సాంబయ్య–సమ్మక్క, రైతు దంపతులు

# ట్రాక్టర్‌కు 50 కిలోలు కోత

- ప్రైవేట్ వ్యాపారుల మోసం.. రైతులకు నష్టం
- మార్కెట్ ఆదాయానికీ గండి



వే బ్రిడ్జి వద్ద తూకం వేస్తున్న ధాన్యం ట్రాక్టర్

కేసముద్రం, నవంబర్ 27 : ధాన్యం పండించిన రైతులు ప్రైవేట్ వ్యాపారుల చేతిలో మోస పోతున్నారు. కల్లాల వద్దే తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు వే బ్రిడ్జి కాంటా వేస్తూ తరుగు పేరుతో ట్రాక్టర్‌కు 40 నుంచి 50 కేజీల వరకు కోత విధిస్తున్నారు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు నష్టపోతుండగా, మార్కెట్ ఆదాయానికీ గండి పడుతున్నది. మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని వ్యాపారులు కొనుగోలు చేస్తే రూ.100కు ఒక రూపాయి చొప్పున పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కల్లాల వద్దే క్రయవిక్రయాలు జరుగుతుండడంతో పన్నులు చెల్లించడం లేదు. రైతులు మార్కెట్లో ధాన్యం విక్రయిస్తే తక్‌పట్టీ ఆధారంగా వ్యాపారులు డబ్బులు చెక్కు రూపంలో అందించడం వల్ల భద్రత ఉంటుంది. ధాన్యాన్ని నేరుగా మిల్లులకు తరలించడంతో వ్యాపారులు వాయిదా పద్ధతుల్లో చెల్లిస్తున్నారు. పైగా డబ్బులు వెంటనే కావాలని అడిగిన రైతులకు నూటికి రూ. రెండు చొప్పున కోత పెడుతున్నారు.

**తనిఖీలు చేపట్టని అధికారులు**

ఈ ఏడాది మహబూబాబాద్ జిల్లాలో 2.01 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా, ప్రస్తుతం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో కొంతమంది వ్యాపారులు కల్లాల వద్దే వడ్లు ఖరీదు చేసి గోదాములు, మిల్లుల్లో అక్రమంగా నిల్వ చేస్తున్నారు. ఈ ధాన్యాన్ని బియ్యంగా మార్చి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెటింగ్ శాఖ, సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీలు చేపట్టకపోవడం వల్లే ప్రైవేట్ వ్యాపారులు రైతులను మోసం చేస్తూ, ఇష్టానుసారంగా ధాన్యం నిల్వ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



పడమటిగూడెం వద్ద పత్తి అమ్ముకునేందుకు క్యూలో వాహనాలు

## పత్తి అమ్మేందుకు పాట్లు

సీసీఐ వద్ద వాహనాల బారులు

ఓ వైపు ధాన్యం.. మరోవైపు పత్తి అమ్ముకునేందుకు రైతన్న పాట్లు పడుతున్నాడు. నర్సింహులపేట మండలం పడమటిగూడెం పత్తి మిల్లు వద్ద అసలు రైతుల కంటే వ్యాపారులకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తూ తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ ద్వారా మద్దతు ధర వస్తుందని వెళ్తే దళారులతో కుమ్మక్కై తేమ పేరుతో తక్కువ ధర చెలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. సీసీఐ దిగుమతులు చేయకపోవడంతో రైతులు వాహనాలతో ఇలా బారులు తీరాల్సి వచ్చింది.

- నర్సింహులపేట, నవంబర్ 27

## హార్వెస్టర్ యజమాని దారుణ హత్య

### మహదేవపూర్ మండలంలో ఘటన

మహదేవపూర్ (కాళేశ్వరం), నవంబర్ 27 : హార్వెస్టర్ యజమాని దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన మహదేవపూర్ మండలం సండ్రుపల్లి శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన హార్వెస్టర్ యజమాని ముత్యాల శ్రీకాంత్ గౌడ్ (26) మండలంలోని సండ్రుపల్లి గ్రామానికి వరికోత కోసం డ్రైవర్‌ను పంపించాడు. పని పూర్తవడంతో హార్వెస్టర్‌తో పాటు డ్రైవర్‌ను తీసుకవెళ్లేందుకు కారులో గ్రామానికి వచ్చాడు. హనుమాన్ టెంపుల్ వద్ద వేచిచూస్తున్న క్రమంలో పల్సర్ బైక్‌పై గుర్తు వ్యక్తులు వచ్చి కారులో కూర్చున్న శ్రీకాంత్‌ను కత్తులతో కడుపులో పొడిచి హత్య చేశారు. దూరం నుంచి గమనించిన హార్వెస్టర్ డ్రైవర్ కేకలు వేయడంతో దుండగులు బైక్‌ను వదిలేసి అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కాగా, హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## లైంగికదాడికి యత్నించిన వృద్ధుడికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, నవంబర్ 27: ఎనిమిదేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన 70 ఏళ్ల వృద్ధుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా అదనపు జడ్జి ప్రేమలతారెడ్డి మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ. 5 లక్షల పరిహారం ఇప్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం పంతులు పల్లెకు చెందిన గూడె రాజయ్య (70) తన పక్కింట్లో ఉంటున్న బాలికకు జ్వరం రావడంతో తల్లి ఆమెను ఇంటి వద్దే వదిలి కూలి పనులకు వెళ్లింది. ఒంటరిగా ఉన్న బాలికపై కన్నేసిన కామాంధుడు పల్లీలు ఇస్తానని బాలికను తన ఇంట్లోకి పిలుచుకొని లైంగిక దాడికి యత్నించాడు. ఈలోగా బాలిక అమ్మమ్మ పాప కోసం వెదుకుతుండగా పొరుగు వారు నిందితుడు ఇంట్లోకి తీసుకెళ్లాడని చెప్పారు. అక్కడ పాప కనిపించడంతో ఏమైందని అడగగా ఈ తాత తనతో అసభ్యంగా ప్రవర్తించాడని చెప్పడంతో, బాలిక కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. పోక్సో చట్టంతో పాటు వివిధ సెక్షన్ల కింద నిందితుడిపై కేసు నమోదు చేసిన నల్లబెల్లి పోలీసు విభాగం తగిన సాక్ష్యాధారాలు సేకరించింది. కేసు విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో నిందితుడికి శిక్ష విధించారు. బాలిక తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మర్రి వాసుదేవ రెడ్డి వాదించగా, భరోసా లీగల్ ఆఫీసర్ నీరజ పర్యవేక్షణలో కోర్ట్ కానిస్టేబుల్ మహేశ్ సాక్షులను ప్రవేశ పెట్టారు.

## అత్యాచారం చేశాడని నమ్మించి..

### రూ. లక్ష తస్కరించిన సైబర్ నేరగాళ్లు

దామెర, నవంబర్ 27 : సైబర్ నేరగాళ్ల వలలో ఓ వ్యక్తి చిక్కి రూ. లక్ష పోగొట్టుకున్న ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెల్పూరి సంపత్ సెల్‌ఫోన్‌కు ఈ నెల 21న గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి సురేశ్ తండ్రి లక్ష్మయ్యనా అని అడిగాడు. సురేశ్ తనకు వరుసకు కొడుకు కావడం, సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ నుంచి ఇటీవలే ఏఆర్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకోవడంతో నమ్మిన సంపత్ అవునని సమాధానం చెప్పాడు. దీంతో అవతలి వ్యక్తి సురేశ్ ఒక అమ్మాయిపై అత్యాచారం చేశాడని, ఆమె చావు బతుకుల్లో ఉందని తెలిపి రూ. లక్ష వెంటనే కావాలన్నాడు. ఆందోళన చెందిన సంపత్ పలు దఫాలుగా రూ.1000, ఆ తరువాత రూ. 19,000, రూ. 20,000, రూ. 20,000 ఫోన్ పే, గూగుల్ పే ద్వారా పంపాడు. ఆ తర్వాత వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో హనుమకొండకు చెందిన లింగాల పృథ్వీరాజ్ ఫోన్ నుంచి రూ. 20,000, రూ. 4,000, రూ.1,000, అలాగే సమీపంలోని ఓ ఆస్పత్రికి చెందిన స్నేహితుడు మహేందర్ సెల్‌ఫోన్ నుంచి కూడా రూ.15,000 పంపించాడు. మొత్తంగా రూ. లక్ష ముట్టినట్లు సంపత్ ఫోన్ చేయగా, మీడియా, పోలీసులను మేనేజ్ చేసేందుకు మరో రూ. 60 వేలు కావాలనడంతో అనుమానం వచ్చిన సంపత్ వెంటనే సురేశ్‌కు ఫోన్ చేసి అత్యాచార విషయంపై ఆరా తీశాడు. అదంతా అబద్ధమని, తాను వరంగల్‌కు వస్తున్నానంటూ చెప్పడంతో మోసపోయానని గుర్తించిన సంపత్ వెంటనే వరంగల్‌లోని మట్టెవాడ పోలీసులను ఆశ్రయించడంతో పాటు సైబర్ క్రైం టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు.


